ఆంధ్రజ్యోతి
5
ANDHRAJYOTHY
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 4 సెప్టెంబరు 2024

ఎండీఎంలో నూతన మెనూ: డీఈవో

గుజరాతీపేట, సెప్టెంబరు 3: మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) అమలుపై కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకుని నూతన మెనూ ప్రవేశపెట్టనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలో మధ్యాహ్న భోజనం పథకంపై డివిజన్ల వారీగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యూట్రీ గార్డెన్‌ను పాఠశాల ఖాళీ స్థలాల్లో పెంచడం, పారిశుధ్యం అమలుపై చర్చించారు. సమావేశంలో ఎంఈవోలు, హెచ్ఎంలు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్లు, వంట నిర్వాహకులు పాల్గొన్నారు.

సముద్రపు ఇసుకనూ వదల్లే!


దోనిపేట వద్ద సముద్ర తీరంలో ఇసుక దిబ్బలు

● తీరంలో ఇసుక తోడేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారు. అధికార దర్పాన్ని ప్రయోగిస్తున్నారు. తమకు రాజకీయ అండదండలున్నాయని చెబు తున్నారు. ఇసుక తవ్వకాలతో తీరం కోతకు గురవుతోంది. మా గ్రామం మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రహదారులు ధ్వంసమవుతున్నాయి. మీరే చర్యలు తీసుకోవాలి.

-ఇటీవల పోతయ్యపేట తీర ప్రాంతంలో పర్యటించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు మత్స్యకారులు చేసిన విన్నపం ఇది.




- తీరంలో యథేచ్ఛగా తవ్వకాలు
- సమీప తోటల్లో నిల్వలు, రాత్రికి తరలింపు
- ప్రతిరోజూ లారీల్లో విశాఖకు రవాణా
- ఆందోళనలో మత్స్యకారులు
- ఆ ఇసుకతో నిర్మాణాలు ప్రమాదమంటున్న నిపుణులు
- అయినా పట్టించుకోని అధికారులు

(రణస్థలం)

ఇసుక అక్రమార్కులు దందాను మార్చారు. సముద్ర తీర ప్రాంతంలో ఇసుకపై దృష్టి పెట్టారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించింది. రవాణా చార్జీలు నిర్ణయిస్తూ.. నిర్ణీత ధరకే ఇసుకను అందిస్తోంది. ఈ నేపథ్యంలో గృహనిర్మాణంతో పాటు రియల్ ఎస్టేట్ రంగం మరింత ఊపందుకుంది. నగరాల్లో ఇసుక అవసరాలు పెరిగాయి. ఇదే అదునుగా కొందరు తీర ప్రాంతంలో ఇసుకను తవ్వేస్తున్నారు. ఆ ఇసుకను.. నదుల్లో సేకరించిన ఇసుకతో కలిపి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. సముద్రపు ఇసుక అయితే ప్రభుత్వానికి ఎటువంటి చెల్లింపులు చేయనక్కర్లేదు. పైగా కావలసినంత ఇసుక దొరుకుతుంది. ఈ నేపథ్యంలో యంత్రాలతో తీరప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేపట్టి సమీప తోటల్లో నిల్వచేయడం.. రాత్రిపూట తరలించడం పరిపాటిగా మారింది. ముఖ్యంగా రణస్థలం మండలం దోనిపేట, కొచ్చెర్ల, కొమరవానిపేట, ఎన్‌జీఆర్ పురం, పాతయ్యపేట, చీకటిపేట తీరాల నుంచి రోజుకు సగటున పదుల సంఖ్యలో లారీల్లో ఇసుక తరలిపోతోంది. దీనిపై మత్స్యకారులు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు ఉన్నాయి. ఇటీవల జేఆర్ పురం పోలీసులు నిఘా పెట్టారు. రెండు లారీలను పట్టుకొని.. ఇసుక తరలిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. గతంలో దోనిపేట గ్రామస్థులు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో ఇసుక అక్రమార్కులు దాడులు చేశారు. పోలీసు కేసులు, నిఘా పెరగడంతో కొద్దిరోజుల పాటు దందాకు బ్రేక్ పడింది. కానీ ఇటీవల మళ్లీ ఇసుక దందా ప్రారంభమైంది.

● ప్రమాదమని.. తెలిసినా..

వాస్తవానికి సముద్ర తీర ప్రాంతంలో ఇసుకను గృహ నిర్మాణానికి వినియోగించరు. కానీ రహదారులు, రైల్వే వంతెనల నిర్మాణానికి నిబంధనలకు విరుద్ధంగా ఈ ఇసుకను వినియోగిస్తున్నట్టు తెలుస్తోంది. సముద్రపు ఇసుకలో ఉప్పుశాతం అధికం. దీనిని సిమెంట్‌లో మిళితం చేస్తే ఎక్కువగా నీరుగారిపోతుంది. ఒకవేళ వాడాలనుకుంటే కచ్చితంగా ఆ ఇసుకను మంచినీటితో శుద్ధి చేయాలి. కానీ అది చాలా కష్టతరమైన పని. సముద్రపు ఇసుక చాలా సన్నంగా ఉంటుంది. దానిని సిమెంట్‌తో కలిపితే అది సులువుగా మిశ్రమం అవ్వదు. నిర్మాణం కూడా బలంగా ఉండదు. పటుత్వం కోల్పోతుంది. సముద్రపు అలల కారణంగా ఇసుకలో ఉండే సత్తువ అంతా పోతుంది. అందుకే సముద్రపు ఇసుకతో నిర్మాణాలు చేపడితే ప్రమాదకరమని సాంకేతిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఇసుకలో సోడియం క్లోరైడ్ ఎక్కువగా ఉండడంతో కొద్దికాలానికే నిర్మాణాలు కూలిపోతాయని స్పష్టం చేస్తున్నారు. కానీ అక్రమార్జనకు అలవాటుపడిన వారు సముద్రపు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నిర్మాణ రంగాన్ని ప్రమాదంలో నెడుతున్నారు.


ఇటీవల సముద్రపు ఇసుక తరలిస్తూ.. జేఆర్ పురం పోలీసులకు పట్టుబడిన లారీలు


కొత్తముక్కాం తీరం వద్ద ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గోతులు

● విశాఖకే ఎక్కువగా..

జిల్లాలో తీర ప్రాంతం నుంచి ఇసుకను ప్రధానంగా విశాఖ నగర అవసరాలకు తరలిస్తున్నారు. ప్రస్తుతం ఇసుకకు విపరీతమైన డిమాండ్ ఉంది. వర్షాలు పడుతుండడంతో నదులు, కాలువల్లో ఇసుక లభ్యత లేదు. దీంతో అక్రమార్కుల కన్ను సముద్రపు ఇసుకపై పడింది. ట్రాక్టర్లు, టిప్పర్ల యాజమానులతో సిండికేట్ అయి.. వారి సాయంతో తీరంలో ఇసుకను తోటల్లోకి డంపింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రిపూట లారీల్లో విశాఖకు తరలిస్తున్నారు. లారీ ఇసుకను రూ.20 వేల నుంచి రూ.25వేల వరకూ విక్రయిస్తున్నారు. విశాఖలో గృహ నిర్మాణాలతో పాటు కొన్నిచోట్ల రహదారుల పనులకూ ఇదే ఇసుకను వాడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

● మత్స్యకారుల్లో భయం..

జిల్లాలో తీర ప్రాంతంలో దాదాపు 28.7శాతం భూభాగం కోతకు గురైనట్టు కేంద్ర భూ భౌతిక విజ్ఞాన శాఖ మంత్రిత్వ శాఖ ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. జిల్లాకు సంబంధించి 25.12 కిలోమీటర్ల తీర ప్రాంతం రెడ్‌జోన్‌లో ఉన్నట్టు తేలడం ఆందోళన కలిగించే విషయం. ఇటువంటి సమయంలో తీరంలో ఇసుక అక్రమ రవాణాను నియంత్రించకపోతే ప్రమాదం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక్క తీరంలోనే కాదు.. చెంతనే ప్రభుత్వ భూముల్లో ఉన్న సరుగుడు, నీలగిరి తోటల్లో సైతం ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. దీంతో తీరం కోతకు గురవుతోందని మత్స్యకారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. తీర గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● నిఘా పెంచాం

రణస్థలం మండలంలో సముద్ర తీర ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తున్నారని ఫిర్యాదులు వస్తుండడం నిజమే. దీనిపై నిఘా పెంచాం. ఇటీవల రెండు లారీలను పట్టుకున్నాం. నలుగురిపై కేసులు నమోదు చేశాం. ఎక్కడైనా ఇసుక తవ్వకాలు చేపడితే సమాచారం అందించాలి. స్థానిక రెవెన్యూ సిబ్బందికి విషయాన్ని చేరవేయాలి.

- ఎస్.ప్రసాద్, తహసీల్దారు, రణస్థలం

బాలికను గర్భవతిని చేసి..

- ప్రేమ పేరుతో యువకుడి వంచన
- శారీరకంగా లొంగదీసుకున్న వైనం
- అనారోగ్యంతో బాలిక ఆస్పత్రిలో చేరిక..
- కవలలకు జననం.. పరిస్థితి విషమం

రణస్థలం, సెప్టెంబరు 3: ఆ బాలికకు 17 ఏళ్లు. యువకుడికి 21 ఏళ్లు. గత కొన్నాళ్లుగా ఆ బాలికను ప్రేమిస్తున్నానంటూ దగ్గరయ్యాడు. శారీరకంగా కలిశాడు. ఫలితంగా ఆ బాలిక గర్భవతి అయ్యింది. కవలలకు జన్మనిచ్చింది. ఇద్దరివీ వేర్వేరు కులాలు కావడంతో ఈ పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఇందుకు సంబంధించి జేఆర్‌పురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

రణస్థలం మండలంలోని ఓ గ్రామానికి చెందిన లొడగల సూరి అనే యువకుడు.. ఓ 17 ఏళ్ల బాలికను ప్రేమించాడు. ఈ క్రమంలో ఇద్దరూ శారీరకంగా కలవడంతో ఆ బాలిక గర్భవతి అయ్యింది. ఆ విషయాన్ని బాలిక దాచింది. బాలిక శరీరాకృతితో మార్పు రావడంతో కుటుంబ సభ్యులు సోమవారం శ్రీకాకుళంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ బాలిక గర్భవతి అని తేలడంతో షాక్‌కు గురయ్యారు. ఇంతలో ఆ బాలిక ఆస్పత్రిలోనే సోమవారం రాత్రి కవలలకు జన్మనిచ్చింది. ఏడు నెలలకే ప్రసవం కావడంతో బాలిక ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. అటు కవల శిశువులు సైతం అనారోగ్యానికి గురయ్యారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు ఆ యువకుడిని నిలదీశారు. దీనిపై జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి తెలిపారు.



పలాస జీడికి.. మహా ప్రసాదం

- ఇక తిరుమల లడ్డూలో వినియోగం
- తొలిసారి బిడ్ దక్కించుకున్న వ్యాపారి
- రోజూ 3 టన్నుల సరఫరాకు అంగీకారం


పలాసలో జీడి పరిశ్రమ

పలాస, సెప్టెంబరు 3: పలాస జీడికి మహా ప్రసాదం దక్కింది. రుచి, సువాసనలో తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదానికి ఎంతో ప్రాధాన్యం, ప్రాముఖ్యత ఉంది. ఈ లడ్డూ తయారీకి వినియోగించే వస్తువుల్లో జీడిపప్పు కూడా ప్రధాన భూమిక పోషిస్తోంది. ఇకపై ఈ లడ్డూలో పలాస జీడిపప్పునకు స్థానం దక్కింది. పలాసకు చెందిన వ్యాపారి కోరాడ సంతోష్(ఎస్ఎస్ఎస్ ఇంటర్నేషనల్ ఆగ్రో).. టీటీడీకి జీడిపప్పు సరఫరా చేసే టెండర్లు దక్కించుకున్నారు. మూడు రోజుల కిందట గ్లోబల్ విధానం ద్వారా టెండర్లు పిలవగా కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది వ్యాపారులు పోటీ పడ్డారు. దేశవ్యాప్తంగా 3వేలకు పైగా జీడి పరిశ్రమలు ఉండగా.. అనూహ్యంగా పలాస వ్యాపారికి ఈ అవకాశం దక్కింది. తిరుపతి బాలాజీ లడ్డూల తయారీకి రోజూ 3 టన్నుల జీడి పప్పు అవసరం. ప్రస్తుతం జేహెచ్(బద్ద) రకం జీడిపప్పు సరఫరా చేయాలని టీటీడీ నుంచి వర్తమానం అందింది. ఈ మేరకు ఆ రకం పప్పు తయారీలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. కలియుగ దైవంగా కొలువబడే శ్రీ వెంకటేశ్వరస్వామికి నేరుగా మన జీడిపప్పు వెళ్తుండడంతో.. దానికి అనుగుణంగా శుభ్రత, నాణ్యత, శుచితో జీడి పప్పును తయారు చేస్తున్నారు. మొత్తం 300 మంది కార్మికులు రెండు రోజుల నుంచి జేహెచ్ రకం జీడిపప్పు తయారు చేస్తూ.. కిలో, రెండు, ఐదు, పది కిలోలు చొప్పున ప్యాకింగ్ చేస్తున్నారు. నెలకు సరిపడా జీడిపప్పును వారం రోజుల్లో పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

45 ఏళ్లకు ముందు.. తర్వాత..

టీటీడీ లడ్డూ ప్రసాదానికి జీడిపప్పును కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి గుత్త పద్ధతిలో సేకరించేవారు. మొదట నేరుగా తిరుమల తిరుపతి దేవస్థానమే కొనుగోలు చేసేది. అనంతరం వివిధ మార్పుల చోటుచేసుకొని గ్లోబల్ టెండర్ల ద్వారా సేకరిస్తున్నారు. జీడిపప్పు తయారీలో మన రాష్ట్రం దేశవ్యాప్తంగా ఐదో స్థానంలో ఉంది. 45ఏళ్లకు ముందు మన రాష్ట్రంలో అగ్రగామిగా ఉన్న పలాస మొక్క జీడిపప్పును వినియోగించారని వ్యాపారులు చెబుతున్నారు. ఆ స్థాయిలో సరఫరా చేయకపోవడంతో కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు పోటీ పడి జీడిపప్పు సరఫరా టెండర్లు దక్కించుకున్నాయి. అప్పటి నుంచీ మన రాష్ట్ర జీడిపప్పు విదేశాలకు విక్రయాలకు తప్ప.. స్వదేశంలో ఉన్న ప్రధాన ఆలయాలకు సరఫరాకు నోచుకోలేదు. ఎట్టకేలకు పలాస జీడిపప్పు చాలా ఏళ్ల తరువాత తిరుపతి బాలాజీ లడ్డూలో ప్రధాన భూమిక పోషించనుండడంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శ్రీవేంకటేశ్వర స్వామి దయతోనే తమకు ఈ అవకాశం దక్కిందని, లాభాపేక్ష లేకుండా టీటీడీకి అందించాలని నిర్ణయించామని ఎస్ఎస్ఎస్ ఇంటర్నేషనల్ ఆగ్రో చైర్మన్ కోరాడ సంతోష్ కుమార్ తెలిపారు.


జీడిపప్పు తయారీలో నిమగ్నమైన కార్మికులు

తుఫాన్ నష్టంపై నివేదిక ఇవ్వండి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 3: తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో ఎక్కడైనా ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులకు నష్టం వాటిల్లినా, పంట నష్టం జరిగినా వెంటనే నివేదిక ఇవ్వాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో పలు అంశాలపై మాట్లాడారు. 'మరో రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో ఇప్పటివరకు 306 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది. నీటిపారుదల శాఖ పరిధిలో రూ.30లక్షల ఆస్తి నష్టం జరిగింది. పలు చోట్ల స్తంభాలు నేలకొరిగి విద్యుత్‌శాఖకు రూ.2లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. నాలుగు ఇళ్లు, రెండు చోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయి' అని కలెక్టర్ తెలిపారు.

అలాగే జిల్లాలో జ్వరాలు అదుపులోకి రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే తప్పులులేని ఓటరు జాబితా తయారు చేయాలని.. బీఎల్‌వోలకు ఆదేశించారు. ఈ నెల 15లోగా ఈ-క్రాప్ వివరాలు నమోదు చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. ఎరువుల కొరత రాకూడదని స్పష్టం చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో అప్పారావు, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, వ్యవసాయాధికారి కె.శ్రీధర్, ఉద్యానవనాధికారి ప్రసాదరావు, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి పాల్గొన్నారు.

నత్తనడకన ఈ-క్రాప్

- క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం
- ఇప్పటివరకు 74 శాతమే పూర్తి
- మరో 12 రోజులే గడువు

జిల్లాలో ఈ-క్రాప్ నమోదు నత్తనడకన సాగుతోంది. ఇప్పటి వరకు పంటల నమోదు 74.15 శాతం మాత్రమే పూర్తయ్యింది. ఉన్నతాధికారులు పదేపదే ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో లక్ష్యం పూర్తి కావడం లేదు. సుమారు 17 మండలాల్లో ఈ-క్రాప్ ప్రక్రియ మంద కొడిగా సాగుతోంది. మరో 12 రోజులే గడువు ఉండడంతో లక్ష్యం పూర్తిపై సందేహాలు నెలకొన్నాయి. మిగతా జిల్లాలతో పోల్చితే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సొంత జిల్లాలోనే వెనుకంజలో ఉండడం విమర్శలకు తావిస్తోంది. -(నరసన్నపేట)


తామరాపల్లి వద్ద ఈ క్రాప్ నమోదు

జిల్లాలో 5,27,852 ఎకరాల పంట భూములు ఉన్నాయి. ఈఏడాది ఖరీఫ్‌లో 4,38,655 ఎకరాల్లో వరి, తదితర పంటలను సాగు చేస్తున్నారు. అయితే, ఇప్పటి వరకు 2,87,063 ఎకరాల్లోని పంటలనే ఈ - క్రాప్‌లో నమోదు చేశారు. జిల్లాలో సరాసరిగా 74.15 శాతం ఈ క్రాప్ పూర్తయ్యింది. వీఆర్వోలు, ఏఈవోలతో తహసీల్దార్లు, ఏవోలు పలుమార్లు సమావేశాలు నిర్వహించి ఈ నెల 15లోగా ఈ క్రాప్ ప్రక్రియ పూర్తి చేయాలని పదేపదే చెబుతున్నా ఫలితం శూన్యం. క్షేత్రస్థాయిలో మాత్రం స్పీడు లేదు. ఇంకా 12 రోజుల గడువు మాత్రమే ఉండడంతో లక్ష్యం పూర్తిపై సందేహాలు నెలకొన్నాయి. పొందూరు, కంచిలి, ఇచ్ఛాపురం, రణస్థలం, పలాస, జి.సిగడాం, కవిటి, నందిగాం, మందస, ఆమదాలవలస, ఎచ్చెర్ల, కొత్తూరు. సరుబుజ్జిలి, శ్రీకాకుళం, టెక్కలి, వజ్రపుకొత్తూరు, గార మండలాల్లో ఈ-క్రాప్ నమోదు తక్కువగా ఉంది.

సిబ్బంది నిర్లక్ష్యం

వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ పంట నమోదు చేయాల్సిందేనని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. రైతు ఏ పంట పండిస్తున్నాడు, అది ఏరకం, విస్తీర్ణం, నీటి లభ్యత వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. సాగుదారుడి ఆధార్, ఫోన్ నెంబరు, సర్వే నెంబర్లతో పాటు సాగు పంటలను ఫొటో తీసి యాప్‌లో నమోదు చేయాలి. అయితే గతంలో కౌలు రైతులకు ఈ-పంట నమోదుకు అవకాశం ఉండేది కాదు. దీంతో పంటలు దెబ్బతింటే ఎలాంటి ప్రయోజనం దక్కేది కాదు. ఈసారి ఈ పరిస్థితి లేకుండా ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించి. పొలంలో పంట సాగు చేస్తున్న కౌలు రైతు వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పంట నష్టపోతే బీమా, పెట్టుబడి రాయితీ సాగుదారుడికే దక్కేలనే ఉద్దేశంతో సాగుచేస్తున్న రైతుల పేరు నమోదు చేయాలని ఆదేశించింది. అయితే, గడువు ఉందనే కారణంగా ఈ-క్రాప్‌పై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఆ ప్రక్రియ నత్తనడకన సాగుతుంది.

రైతులకు అండగా ప్రభుత్వం

ఆరుగాలం కష్టించి పంటలను సాగు చేస్తున్న రైతులకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా పంట రుణాలపై వడ్డీ రాయితీ, పంట నష్ట పరిహారం అందించేందుకు, ధాన్యం కొనుగోలు వంటి పలు పథకాలు రైతులు దరి చేరాలంటే ఈ - పంట నమోదే ప్రామాణికం. అంతటి ముఖ్యమైన ఈ ప్రక్రియను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటల నమోదుకు కార్యాచరణ చేపట్టింది. అంతేగాక పంట సాగు హక్కు కార్డులు పొందిన కౌలురైతులకు అవకాశం కల్పించింది. గతంలా కాకుండా సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. రైతు ఫోన్‌కు వచ్చే ఓటీపీ, బయోమెట్రిక్, ముఖ చిత్రం గుర్తింపు వంటిని యాప్‌లో నమోదు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడానికి, ప్రకృతి విపత్తులు సమయాల్లో బీమా పొందడానికి, ఎరువులు, పురుగు మందులు పంపిణీకి ఈ క్రాప్ ఎంతో కీలకం.

గడువులోగా పూర్తిచేయాలి

ఈనెల 15 లోగా శతశాతం ఈ క్రాప్ నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ఇప్పటికే 74.15శాతం మేరకు నమోదు జరిగింది. ఇంకా జరగాల్సి ఉంది. ప్రక్రియ వేగవంతం చేస్తాం. వర్షాల కారణంగా సిబ్బంది క్షేత్రస్థాయిలో వెళ్లలేకపోవడం కూడా వెనుకబడటానికి ఒక కారణం.

- శ్రీధర్, జేడీ, వ్యవసాయశాఖ

నిట్ ఆంధ్రలో పీహెచ్‌డీ



పశ్చిమగోదావరి జిల్లా-తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ ఆంధ్ర)- విశ్వేశ్వరాయ స్కీమ్ కింద పీహెచ్‌డీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో 5 సీట్లు, పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో 2 సీట్లు ఉన్నాయి. రిటెన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

అర్హత: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి అభ్యర్థులు ఇంజనీరింగ్/టెక్నాలజీ/సైన్స్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయిల్లో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. గేట్/నెట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే రీసెర్చ్ ఆర్గనైజేషన్‌లు/అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్‌లు/ఇండస్ట్రీలలో కనీసం రెండేళ్ల పనిచేసిన అనుభవం ఉండాలి.

ఫెలోషిప్: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు మొదటి రెండేళ్ల నెలకు రూ.38,750; చివరి మూడేళ్ల నెలకు రూ.43,750లు ఇస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1,20,000 ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **ఈ-మెయిల్:** hdadmissions@nitandhra.ac.in
- **వెబ్‌సైట్:** www.nitandhra.ac.in

దిక్సూచి DIKSUCHI

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ), స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'బీటెక్ & బీఎస్+ఎంఎస్' ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి సెకండ్ ఫేజ్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. జేఈఈ మెయిన్స్ 2024 ర్యాంక్/ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/ఇతర రాష్ట్రాల ఎంట్రెన్స్ ఎగ్జామ్‌ల స్కోర్లు ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిని అనుసరిస్తారు.

జేఎన్‌టీయూఏలో ఐసీపీ సెకండ్ ఫేజ్

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. అభ్యర్థులు మొదటి మూడేళ్లు అనంతపురం జేఎన్‌టీయూలో, చివరి మూడేళ్లు స్వీడన్ బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగేళ్ల కోర్సు పూర్తయిన తరవాత ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. సీఎస్ఈ, ఈసీఈ విభాగాలు ఎంచుకోవచ్చు.

- సీఎస్ఈ అభ్యర్థులు జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్(సీఎస్ఈ); స్వీడన్ బీటీహెచ్ నుంచి బీఎస్(కంప్యూటర్ సైన్స్), ఎంఎస్(కంప్యూటర్ సైన్స్/సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్-ఏఐ&ఎంఎల్) చదవాల్సి ఉంటుంది.
- ఈసీఈ అభ్యర్థులు జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్(ఈసీఈ); స్వీడన్ బీటీహెచ్ నుంచి బీఎస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్), ఎంఎస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-మెషిన్ లెర్నింగ్, సెన్సార్స్ అండ్ సిస్టమ్స్) చదవాలి.

మిగిలిన సీట్ల వివరాలు: కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్ఈ)లో 7 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)లో 10 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. జేఈఈ మెయిన్స్ 2024 ర్యాంక్/ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/ఇతర రాష్ట్రాల ఎంట్రెన్స్ ఎగ్జామ్‌ల స్కోర్లు ఉండాలి.

- **సెకండ్ ఫేజ్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

Infosys Foundation STEM Stars Scholarship Program

Description: An initiative by Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects.

Eligibility: Female students who are citizens of India and enrolled in the first year of their 4-year undergraduate course in the fields of engineering, medicine (MBBS), and other related STEM subjects at institutes of repute (NIRF accredited) are eligible.

- Applicants must have obtained admission into the identified colleges and must have completed their Class 12.
- The annual family income of the applicants from all sources must be less than or equal to 8 lakh.
- Candidates must not have availed other scholarships for the same expenses

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.

Last Date to Apply: 15-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/ISTS2

SCHOLARSHIP ALERT

Nikon Scholarship Program

Description: An initiative of Nikon India Private Limited to financially support students from disadvantaged sections of society to pursue photography-related courses.

Eligibility: Open for Indian students who have completed Class 12 and are pursuing photography-related courses with a duration of three months or more. Annual family income (from all sources) should be less than INR 6 lakh.

Prizes & Rewards: Up to INR 1,00,000

Last Date to Apply: 20-10-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/NIKON12

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zqexLBVలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



20 నుంచి అక్కినేని చలనచిత్రోత్సవం

లెజండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సంవత్సరం ముగింపు సందర్భంగా ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు ఆయన చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ (ఎఫ్.హెచ్.ఎఫ్) ఒక ప్రకటనలో వెల్లడించింది. అక్కినేని కుటుంబ సభ్యుల సహకారంతో నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్, పీవీఆర్ ఐనాక్స్ లతో కలసి 'ఏయన్నార్ 100- కింగ్ ఆఫ్ ద సిల్వర్‌స్ర్కీన్' పేరుతో ఈ చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫిల్మ్ మేకర్, ఎఫ్.హెచ్.ఐ. డైరెక్టర్ శివేంద్ర సింగ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక చేసిన అక్కినేని అద్భుత చిత్రాలు పదింటిని హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు నగరాలతో సహా 25 ప్రాంతాల్లో ప్రదర్శిస్తామని ఆయన వెల్లడించారు. ఇంతకుముందు అమితాబ్ బచ్చన్, దిలీప్‌కుమార్, దేవానంద్ చిత్రోత్సవాలను ఎఫ్.హెచ్.ఐ నిర్వహించినట్లు శివేంద్ర సింగ్ పేర్కొన్నారు.

వరద బాధితులకు సినీ ప్రముఖుల విరాళం







ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజానీకాన్ని ఆదుకునేందుకు పలువురు సినీ ప్రముఖులు ముందుకొచ్చారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయనిధికి భారీగా విరాళాలు ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూ. కోటి విరాళం ప్రకటించారు. బుధవారం సీఎం చంద్రబాబు నాయుడును కలసి చెక్కు అందజేయనున్నట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని అనుకున్నా, తన వల్ల సహాయ కార్యక్రమాలకు ఆటంకం కలగకూడదని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు ఆయన చెప్పారు.

జూనియర్ ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయనిధికి చెరో రూ. 50 లక్షల చొప్పున మొత్తం రూ. కోటి విరాళాన్ని ప్రకటించారు. 'భారీ వర్షాల వల్ల జరిగిన నష్టం నన్ను కలచివేసింది, ఈ విపత్తు నుంచి తెలుగు ప్రజలు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని ఎన్టీఆర్ చెప్పారు. మహేశ్ బాబు సైతం రూ. కోటి సాయాన్ని ప్రకటించారు. వరదల్లో ముంపునకు గురైన ప్రజలు తొందర్లోనే కోలుకోవాలని, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాత ఎస్. రాధాకృష్ణ, ఎస్. నాగవంశీ కలసి రెండు రాష్ట్రాలకు కలిపి రూ. 50 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందిస్తున్నట్లు ప్రకటించారు. వీరితో పాటు హీరో సిద్ధు జొన్నలగడ్డ రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. 30 లక్షల సాయాన్ని ప్రకటించారు. హీరో విష్వక్సేన్ రెండు రాష్ట్రాలకు చెరో రూ. 5 లక్షల చొప్పున సాయాన్ని ప్రకటించారు. దర్శకుడు వెంకీ అట్లూరి రూ. 10 లక్షలు, హీరోయిన్ అనన్య నాగళ్ల రూ. 5 లక్షల సాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైజయంతి మూవీస్ రూ. 25 లక్షలు ప్రకటించగా, నిర్మాత బన్నీవాస్ 'ఆయ్' చిత్రం వసూళ్లలో పాతిక శాతాన్ని ఏపీ వరద బాధితులకు విరాళంగా అందిస్తున్నట్లు తెలిపారు. సహాయనిధికి విరాళాలను ప్రకటించిన సినీ ప్రముఖులకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో ధన్యవాదాలు తెలిపారు.

ఆ తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది



బాలకృష్ణ

'తాతమ్మ కల' చిత్రంతో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి, యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవం ఇటీవల వైభవంగా జరిగిన సంగతి విదితమే. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'యాభై ఏళ్ల క్రితం మా నాన్నగారు నా నుదిటిన దిద్దిన తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది. యాభై ఏళ్ల నా నట ప్రస్థానం సాగుతూనే ఉంది. వెలుగుతూనే ఉంది. తెలుగు భాష ఆశీస్సులతో, తెలుగు జాతి అభిమాన నీరాజనాలతో పెనవేసుకున్న బంధం ఇది. ఈ రుణం తీరనిది. ఈ జన్మ మీ కోసం.. మీ ఆనందం కోసం. నా ఈ ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను' అని చెప్పారు బాలకృష్ణ. రెండు తెలుగు రాష్ట్రాలను వరద ముంచెత్తుతున్న ఈ తరుణంలో ఆయన స్పందిస్తూ 'ఈ విపత్కర పరిస్థితుల్లో బాధాతప్త హృదయంతో నా బాధ్యతగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 50 లక్షలు బాధిత ప్రజల సహాయార్థం విరాళంగా అందిస్తున్నాను. తెలుగు రాష్ట్రాల్లో అతి త్వరలోనే మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని వెల్లడించారు.

నాన్నే నా హీరో



ఎనభైల దశకంలో బాలీవుడ్‌లో విలన్‌గా ఒక వెలుగు వెలిగిన శక్తి కపూర్ మంగళవారం తన 72వ పుట్టినరోజు సెలబ్రేట్ చేసుకున్నారు. ఎంతో మంది ఆయనకు అభినందనలు తెలిపారు కానీ కుమార్తె శ్రద్ధా కపూర్ ఇచ్చిన పొగడ్త శక్తికపూర్‌కు ఎంతో శక్తినిచ్చింది. మరికొన్నేళ్ల పాటు జీవించాలనే ఉత్సాహాన్ని కలిగించింది. తండ్రితో దిగిన సెల్ఫీని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి 'నాన్నే నా హీరో. తండ్రి అండదండలు ఉంటే జీవితంలో ఏదైనా సాధించగలం' అని కామెంట్ పెట్టింది శ్రద్ధా. ఆమె నటించిన 'స్త్రీ 2' చిత్రం ఇప్పుడు వసూళ్ల పరంగా సంచలన రికార్డులు సృష్టిస్తూ దూసుకుపోతోంది.

వైరముత్తుపై పోరాటంలో వెనకడుగే లేదు



చిన్మయి శ్రీపాద

ఎన్ని బెదిరింపులు వచ్చినా, పరిశ్రమ బహిష్కరణ విధించినా వెరవకుండా దక్షిణాది చిత్రసీమలో 'మీటూ' ఉద్యమానికి చుక్కానిలా నిలిచారు ప్రముఖ గాయని, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి శ్రీపాద. కొన్నేళ్లుగా ఆమె సోషల్ మీడియా వేదికగా మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో ఆమె మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళ పాటల రచయిత వైరముత్తు చేతిలో తాను లైంగిక వేధింపులు ఎదుర్కొన్నానని, ఆ కేసులో తాను ఇంకా పోరాడుతూనే ఉన్నానని తెలిపారు. ప్రముఖ గీత రచయిత, పద్మ పురస్కార గ్రహీత, సంగీత నాటక అకాడమీ సహా పలు జాతీయ పురస్కారల విజేత అయిన సెలబ్రిటీ చేతిలో తాను వేధింపులకు గురయ్యానంటూ చిన్మయి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నాతో పాటు మరికొందరు మహిళలు స్వయంగా మీడియా ముందుకు వచ్చి నోరు విప్పినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. న్యాయం కోసం ఏళ్ల తరబడి కోర్టు చుట్టూ తిరుగుతున్నట్లు చెప్పారు. దీన్ని తమిళ సినీ పెద్దలందరి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని నిరసన వ్యక్తం చేశారు. వైరముత్తుకు తమిళనాడులోని రాజకీయ పార్టీల అండదండలు పుష్కలంగా ఉండడం వల్లే ఇన్నేళ్లైనా తనకు న్యాయం జరగలేదని ఆమె ఆరోపించారు. అతను ఎలాంటి వాడో అందరికీ తెలిసిందే, అయినా ఆయనపై చర్యలు తీసుకోకపోగా నన్నే బలిపశువును చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'తమిళ చిత్ర పరిశ్రమ నా పై కక్ష గట్టింది. అప్పటి డీఎంకే నేత, ఇప్పటి బీజేపీ నాయకుడు.. డబ్బింగ్ యూనియన్ ప్రెసిడెంట్ రాధారవి నాపై బహిష్కరణ వేటు వేశార'ని చెప్పారు. 'మెజారిటీ తమిళ సమాజం, నా తోటి సంగీత కళాకారులు సైతం తప్పంతా నాదే అన్నట్లు దుర్భాషలాడారు. అయినా వెనకడుగు వేయకుండా, వైరముత్తు వేధింపులపై ఇంకా పోరాటం చేస్తూనే ఉన్నాను. ముున్ముందూ ఇది కొనసాగిస్తాను' అని చిన్మయి చెప్పారు.

'ప్రేమమ్' హీరోపై అత్యాచారం కేసు



జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో పలువురు మాలీవుడ్ ప్రముఖులపై వరుసగా అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. తాజాగా 'ప్రేమమ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటుడు నివిన్ పోలీపై అత్యాచారం కేసు నమోదైంది. ఓ నటి ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సినిమాల్లో అవకాశం ఇస్తానని తనను దుబాయ్ తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ప్రాథమిక విచారణ పూర్తి చేసిన పోలీసులు నివిన్ సహా మరో ఆరుగురిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు.

తప్పుగా అర్థం చేసుకున్నారు

తమిళ అగ్రహీరో రజనీకాంత్‌ను 'జస్టిస్ హేమ కమిటీ గురించి మీ అభిప్రాయం చెప్పండి' అని మీడియా కోరగా, 'దాని గురించి నాకేం తెలియదు, క్షమించండి' అని బదులిచ్చిన విషయం తెలిసిందే. దీనిపై కొంతమంది మీటూ ఉద్యమకారులు, నెటిజన్లు రజనీకాంత్ వైఖరిని తప్పుపట్టిన నేపథ్యంలో తమిళ నటి రాధికా శరత్‌కుమార్ ఆయన్ని వెనుకేసుకొచ్చారు. రజనీకాంత్‌కు నిజంగానే హేమ కమిటీ గురించి ఏమీ తెలియదనీ, అందుకే ఆయన దాని గురించి మాట్లాడలేదని వివరణ ఇచ్చారు. ఆయన మౌనాన్ని ప్రజలు తప్పుగా అర్థం చేసుకోవడం బాధాకరమన్నారు.

ఆడ లేడీస్ వర్సెస్ మగ జెంట్స్



శ్రీవిష్ణు హీరోగా నటించిన 'శ్వాగ్' చిత్రం విడుదల తేదీ ప్రకటించారు. హసిత్ గోలీ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా దసరా పండగకు పది రోజుల ముందే అంటే అక్టోబర్ 4న విడుదల కానుంది. ఈ సినిమాతో శ్రీవిష్ణు మరో విభిన్న కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఆయన సరసన రీతూ వర్మ నటించారు. సినిమాలో ఆడ లేడీస్, మగ జెంట్స్ మధ్య ఉండే ఆసక్తికరమైన కంటెంట్ అలరిస్తుందని శ్రీవిష్ణు, రీతూ వర్మ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.మీరా జాస్మిన్, సునీల్, దక్ష నగర్కార్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

కొత్తగా..

తుపాకులతో పోలీసు బందీ



సన్నీ అఖిల్, గిద్దేష్ అజయ్ ఘోష్ తదితరులు నటించిన 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం ఫస్ట్ లుక్‌ను నటుడు శ్రీకాంత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టైటిల్ లాగానే ఫస్ట్ లుక్ కూడా విభిన్నంగా ఉంది. సాధారణంగా ఎవరినైనా తాళ్లతోనూ, సంకెళ్లతోనో బంధిస్తారు. కానీ ఒక పోలీస్‌ను తుపాకులతో కట్టి బంధించడం నిజంగా కొత్తగా ఉంది' అని అభినందించారు. అభ్యుదయ చిత్రాల దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి.





15 నాటికి ఈ-పంట లక్ష్యం పూర్తికి చర్యలు: ఏడీఏ మధు

పలాసరూరల్: ఖరీఫ్-2024లో భాగంగా ఈ-పంట నమోదులో ఈనెల 15 నాటికి లక్ష్యం సాధించే దిశలో చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయశాఖ ఏడీ మధు అన్నారు. పలాస వ్యవసాయ కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ.. మెళియాపుట్టి, వజ్రపు కొత్తూరు, మందస, పలాస మండలాల్లో ఈ-పంట నమోదును ఆర్బీకేల ద్వారా చేపడుతున్నామన్నారు. మంగళవారం వరకు మెళియాపుట్టి మండలంలో 15,888 ఎకరాల్లో భాగంగా 14,415.4 ఎకరాల్లో 90.73 శాతం నమో దు జరిగిందన్నారు. వజ్రపుకొత్తూరులో 17,228 ఎకరాలకు గాను 12,674.7 ఎకరాలు, మందసలో 25, 981 ఎకరాలకు గాను 18,800 ఎకరాలు, పలాస మండలంలో 12,336 ఎకరాలకు గాను 7,858 ఎక రాల్లో నమోదు పూర్తయిందన్నారు. మిగిలిన లక్ష్యం గడువులోగా పూర్తి చేస్తామన్నారు.

ఈ క్రాప్ నమోదు వేగవంతం చేయాలి

నరసన్నపేట: ఈ క్రాప్- నమోదు వేగవంతం చేయాలని ఏవో సునీత అన్నారు. మంగళవారం ఉర్లాం పంచాయతీలో ఈ- క్రాప్ నమోదును పరిశీలించారు. ఈనెల 15 నాటికి శతశాతం పూర్తి చేయాలన్నారు. ముంపులో ఉన్న పొలాలకు బూస్టర్ డోస్ ఎరువులను వేయాలని సూచించారు. వరదనీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.

తంపర ముంపు నివారణకు చర్యలు చేపట్టండి



ఎమ్మెల్యేకి వినతి పత్రం అందిస్తున్న తంపర రైతులు, నాయకులు

సుసరాం(పోలాకి): సుసరాం నుంచి దండులక్ష్మీపురం వరకు సుమారు 2500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తంప భూముల ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల రైతులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని తంపర పోరాట కమిటీ నాయకులు తమ్మినాన భూషణరావు, బి.బాలకృష్ణ, లావేటి కృష్ణ తదితరులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో రూ.12 కోట్లు మంజూరు చేశారని, ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వంలో ఆ పనులపై నిర్లక్ష్యం వహించారన్నారు. తగు చర్యలు తీసు కుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తంపర భూముల వంశధార కాలువల సమీపంలో రొయ్యల చెరువులు, రోడ్లు నిర్మించి ఆక్రమించారని, రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆక్రమణలను తొలగిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. తంపర భూములను పరిశీలించారు. రాజకీయాలకు అతీతంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. వంశధార డీఈ బాలక శ్రీహరి, ఏఈ శ్యామలరావులతో ఎమ్మెల్యే సమీక్షించారు.

సీఎం చంద్రబాబును విమర్శించడం సరికాదు



మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు

పలాసరూరల్: విజయవాడలో వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న బాధితులకు అండగా వారి మధ్యే ఉంటూ భరోసా కల్పిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడును మాజీ మంత్రి అప్పలరాజు విమర్శించడం దారుణమని, ఇటువంటివి మానుకోవాలని టీడీపీ నాయకులు అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ.. వైఎస్ వర్ధంతి సందర్భంగా ప్రజలను తప్పుదోవ పట్టించేలా అప్పలరాజు మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మూడురోజులుగా రాత్రీ, పగలు ప్రజల ఇబ్బందులను తొలగిం చేందుకు వారి మధ్యే ఉంటున్న చంద్రబాబుపై నిందలు వేయడం భావ్యం కాదన్నారు. వరదల సమ యంలో రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. ఇప్పటికైనా మాజీ మంత్రి నోటిని అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, లేదంటే తాము కూడా మాట్లాడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్ర మంలో మండల నాయకులు పోలాకి పాపారావు, హోరియా మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మాకివలస గిరిజన గ్రామాభివృద్ధికి ప్రణాళిక

జలుమూరు: మర్రివలస పంచాయతీ ఎస్టీ మాకివలస గ్రామమాభివృద్ధికి ప్రణాళిక రూపకల్పన చేసి ఐటీడీఏ అధికారులకు నివేదించనున్నట్లు ఎంపీడీవో పి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద గ్రామంలో ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతులపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. వ్యక్తిగత, సామూహిక, తాగునీరు, విద్యుత్, హౌసింగ్, వైద్యం తదితర సమస్యలు గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ సతీష్‌కుమార్, వ్యవసాయాధికారి కె.సురేష్, ఏపీవో నారాయణరావు, ఏపీఎం తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీవీటీజీ పథకాలపై అవగాహన

నందిగాం: మొగిలిపాడు, సవరబడగాం, కామదేనువు గ్రామాల్లో పీవీటీజీ పథకాలపై మంగళ వారం అవగాహన కల్పించారు. ఎంపీడీవో టి.రాజారావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గిరిజన సంక్షే మానికి అమలు చేయనున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఏపీవో ఎం.నాగరాజు, ఏపీఎం కె.జాంబవతి, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి సమస్యను పరిష్కరించండి

పాతపట్నం: కిమిడి రోడ్డు నుంచి గ్రామానికి ఉండే బీటీరోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఎస్ఎస్ మణుగు ప్రజలు కోరారు. ఎస్ఎస్‌మణుగు గ్రామంలో మంగళవారం పీఎంజన్‌మన్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు సమస్యను అధికారుల దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. పంచాయతీ కార్యదర్శి ఆర్.షణ్ముఖరావు మాట్లాడుతూ గిరిజన గ్రామాల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. ఈ నిధులతో గ్రామసభలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కాగా గిరిజనులు మాట్లాడుతూ.. ఎగువ సిద్ధమణుగుతో పాటు ఎగువ నుండే గూడలకు రక్షితనీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామానికొచ్చే బీటీ రోడ్ అడుగడుగునా గోతులతో ఉందని, మరమ్మతులు చేపట్టాలని కోరారు.

రైతు సమస్యలపై 9 నుంచి దశలవారీ పోరాటం

నందిగాం: రైతు సమస్యలపై దశలవారీ పోరాటం చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోనారి మోహనరావు అన్నారు. మంగళవారం పీపీపురం, కణితివూరు, నందిగాం తదితర గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9, 10 తేదీల్లో గ్రామ సచివాలయాలు, 17, 18 తేదీల్లో మండల కేంద్రాలు, 25న జిల్లా కేంద్రంలో నిరసన తెలుపనున్నామన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామని గత ప్రభుత్వం మీటర్లు అచర్చి అదానీకి ప్రయోజనం కలిగించిందని విమర్శించారు. ప్రభు త్వం మీటర్ల జీవో 22ను రద్దుచేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బగాది వాసు, సంయుక్త కార్యదర్శి టి.భాస్కరరావు, మండల నాయకుడు పి.సాంబమూర్తి పాల్గొన్నారు.

శివాలయంలో విగ్రహాల చోరీ

హిరమండలం: దుర్బలాపురం గ్రామం లోని బాల త్రిపుర సుందరీ సహిత కామేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అర్ధరాత్రి సమయంలో దుండగులు చొరబడి ఆలయ తాళాలు పగలగొట్టి గర్భగుడిలోకి ప్రవేశించారు. లోపల భద్రపరిచిన శివుడు, పార్వతి, నంది,గణపతి, శ్రీవల్లి, దేవసేన, సుబ్రహ్మణ్య స్వామి, దుర్గాదేవి, శివలింగం, సత్య నారాయణస్వామి దేవతల ఇత్తడి, వెండి విగ్రహాలను అపహరించారు. మంగళవారం తెల్ల వారుజామున గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారమిచ్చారు. కొత్తూరు సీఐ ప్రసాద్, ఎస్ఐ మహమ్మద్ యసీన్ ఘటనా ప్రాంతాన్ని సందర్శించారు. క్లూస్ టీం నమూనాలు సేకరించింది. అర్చకులు సంతోష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. కాగా ఇదే ఆలయంలో గతంలో మూడు సార్లు చోరీ జరిగింది. మూడు నెలల కిందట దొంగలు చొరబడి సీసీ కెమెరాలు ఎత్తుకెళ్లారు.

చిక్కాలవలస రైల్వే అండర్ పాసేజ్‌లోకి నీరు

- రాకపోకలకు తీవ్ర అంతరాయం



రైల్వే అండర్ పాసేజ్‌లో నిలిచిన వర్షపునీరు

నరసన్నపేట: చిక్కావలస గ్రామం వద్ద రైల్వే శాఖ నిర్మించిన రైల్వే అండర్ పాసేజ్‌లో మోకాలు లోతు నీరు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు మళ్లించేందుక తగు ఏర్పాట్లు చేయకపోవడంతో ఏమాత్రం వర్షం పడినా రాకపోకలకు అంతరాయం కలుగుతున్నట్లు సుందరాపురం, కూర్మనాథపురం, పారశెల్లి, గొటివాడ, తిమడాం, సవిరిగాం గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మా గ్రామాల నుంచి నిత్యం ఇతర ప్రాంతాలకు ఈ మార్గం నుంచే రావాల్సిన పరిస్థితి ఉందని, వర్షపు నీరు రోజుల తరబడి నిలిచిపోతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వాహనాలు సైతం వర్షపు నీటిలో మొరాయిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్క రించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వర్షాలకు రోడ్లు ఛిద్రం

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- వెన్నుపూస విరుగుతోందంటూ ఆవేదన
- గ్రామాలు, పట్టణాల్లోనూ ఇదే తీరు



మందస: కరణం వీధిలో ఇలా..

జిల్లాలో గడచిన ఐదేళ్లలో రోడ్ల నిర్వహణపై అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో దారుణంగా తయారయ్యాయి. గోడ్లపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహనాలు సైతం షెడ్లకు వెళుతుంటే ప్రయాణికులు వెన్నుపూసలు విరుగుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ఏర్పడిన గోతుల్లో ఇటీవల ఐదు రోజులుగా కురిసిన వర్షాలకు నీరు చేరి మరింత దారుణంగా తయార య్యాయి. రాత్రి సమయాల్లో అయితే ఎక్కడ గొయ్యి ఉందో తెలియని పరిస్థితిలో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి ఏ గ్రామం, పట్టణం మినహాయింపు లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల మర మ్మతులకు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

-జలుమూరు/ పలాస/ పలాస రూరల్/ మందస/ నందిగాం/టెక్కలి



పలాస రూరల్: గోదారిపురం నుంచి సంతలక్ష్మీ పురం వెళ్లే రోడ్డు ఇలా..



జలుమూరు: అబ్బాయిపేట-తలతరియా రహదారి ఇలా...



టెక్కలి: రావివలస రహదారిలో గోతులు



పలాస: బురదమయంగా నర్సిపురం రోడ్డు



నందిగాం: పెంటూరు-పాల్లాడ వయా శివరాంపురం రహదారి..



పలాస: తాళభద్ర పెట్రోల్ బంకు వద్ద రోడ్డు దుస్థితి..

షరామామూలే..

- చిమ్మ చీకట్లో జిల్లా ఆసుపత్రి
- మంత్రి ఆగ్రహం వ్యక్తంచేసినా మారని తీరు
- జనరేటర్ ఉన్నా ప్రయోజనం సున్నా
- ఉక్కపోతకు గురవుతున్న రోగులు

(టెక్కలి)



రోగికి అట్టతో విసురుతున్న సహాయకుడు

టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రి డివిజన్ కేంద్రంలో ఉండడమే కాకుండా చుట్టు పక్కల సుమారు 10 మండలాలకు వైద్య సేవలు అందించే ఆసుపత్రి.. అత్యవసర సేవలతో పాటు నిత్యం వందలాది మంది ఓపీ, ఇన్‌పెషెంట్లు వివిధ వ్యాధులకు చికిత్స పొందేందుకు వస్తుంటారు.. అయితే అధికారుల్లో మాత్రం నిర్లిప్తత కనిపిస్తోంది. ఆసుపత్రి సేవలపై ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినా వారిలో మార్పు రావడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా నిత్యం విద్యుత్ సమస్యలతో రోగులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు.. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఉక్కపోతకు గురై నరకాన్ని అనుభవి స్తున్నామని వారు ఆవేదన చెందుతున్నారు. దీనికి ప్రత్యక్ష ఉదా హరణగా సోమవారం రాత్రి సుమారు 10 నిమషాల పాటు విద్యుత్ నిలిచిపోయి వారు పడిన ఇబ్బం దులు వర్ణనాతీతం. విద్యుత్ నిలిచిపోతే వెంటనే జనరేటర్ వేయాల్సి ఉన్నా ఆ దిశలో ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. కేంద్ర ఆసుపత్రిలో 160 కేవీ జనరేటర్ ఉన్నా గంటకు 15 లీటర్ల డిజిల్ అయి పోతుండడంతో సిబ్బంది జనరేటర్ వేయడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆసు పత్రిలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నా 120 నుంచి 150 కేవీ మధ్యలో విద్యుత్‌ను వినియోగించడం వల్ల ఓవర్ లోడ్‌తో తరచూ సరఫరాలో అంతరాయం కలుగుతోందని విద్యుత్ శాఖాధికారులు పేర్కొం టున్నారు. 150 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే ఎటువంటి సమస్య ఉండదని వారంటున్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, అత్యవసర సమయాల్లో జనరేటర్ ఉపయోగించి రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు. దీనిపై ఎలక్ట్రీషియన్ బొంగు వెంకటరమణ వద్ద ప్రస్తావించగా సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద జంపర్లు కట్ అయ్యాయని, దీంతో ఓల్టేజీ అప్ అండ్ డౌన్ అయిందని, అందువల్ల జన రేటర్ వద్ద ఆటోస్టార్ తొలగించామన్నారు. ఆ సమయంలో జనరేటర్ వేయలేదన్నారు. మంగళవారం ఆటోస్టార్ పెట్టా మన్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సూర్యారావు ను వివరణ కోరగా జనరేటర్‌కు ఆటో స్టార్ ఉందన్నారు. జనరేటర్ ఆన్ అయ్యే సరికి ఐదు నిమషాలు పడుతుందన్నారు. విద్యుత్ సమస్యపై పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్



మిరియాపల్లి గ్రామస్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్

ఎల్.ఎన్.పేట: బంగాళాఖాతంలో మరో రెండు రోజుల్లో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణశాఖ హెచ్చరికల జారీ చేసినందున వంశధారనదీ తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, మెప్మా పీడీ కిరణ్ కుమార్ సూచించారు. దబ్బపాడు, వాడవలస, మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట, బసవరాజుపేట, స్కాట్‌పేట గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుఫాన్ ప్రభావంతో బలమైన గాలులతోపాటు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.కాళీ ప్రసాదరావు, ఈవోపీఆర్డీ ఐ.పద్మజ, పంచాయతీ కార్యదర్శి జయ మోహన్ పాడి తదితరులు పాల్గొన్నారు.

వంశధార నదీ పరీవాహక ప్రాంతాల పరిశీలన

కొత్తూరు: మండలంలోని వంశధార నదికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధకారులు పర్యటించారు. నదిలో వరదల నివారణ, నీటిమట్టం పెరిగితే కోతకు గురయ్యే ప్రాంతాలు, వరదల వల్ల ముంపు ప్రాంతాలను పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు అందించ నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈలు బాబ్జీ, శ్రీరంగనాయకులు, రవీంద్రనాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- **ఎల్ ఎన్‌పేట:** మండలంలోని వంశధార నదీ తీర గ్రామాలు, లోతట్టు ప్రాంతాలకు సంబంధించి కరకట్టల నిర్మాణానికి క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు వంశధార ప్రాజెక్టు ఏఈఈ డి.సంతోష్ తెలిపారు. స్కాట్‌పేట, మోదుగవలస, బసవ రాజుపేట, లక్ష్మీ నర్సుపేట, మిరియాపల్లి, వాడవలస గ్రామాల వద్ద నదీతీర ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. కరకట్టల నిర్మాణానికి గాను భూముల వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరదల వల్ల ఏయే ప్రాంతాలకు నష్టం జరుగుతుందో ఆర్ఐ ఎస్.గవరయ్యను అడిగి తెలుసుకున్నారు. సర్వేయర్ ఆర్.గవరయ్య, రెవెన్యూ కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు

నరసన్నపేట: పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులు ఎక్కిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పల్లిపేట జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. స్కూల్ విద్యార్థులను పరిమితికి మించి పాఠశాలకు తీసుకువెళ్లడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్రవాహనాలను మైనర్లు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు మైనర్లు పట్టుబడడంతో వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

బాలికా రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోండి

వజ్రపుకొత్తూరు: బాలికా రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కాశీబుగ్గ ఐసీడీఎస్ పీవో లావణ్య అన్నారు. మంగళవారం అక్కుపల్లి హైస్కూల్ విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. బాలికలు, మహిళల రక్షణకు 1098, 181 సేవలను వినియోగించుకోవాలన్నారు. అపచిత వ్యక్తుల నుం చి రక్షణ పొందేందుకు ఎవరితో మాట్లాడాలి, దిశ చట్టం అంశాలను వివరించారు. కార్యక్రమంలో అక్కుపల్లి సెక్టర్ సూపర్‌వైజర్ లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జలుమూరు: చట్టం కల్పించిన హక్కులపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని హెచ్‌ఎం ఇప్పిలి వేణుగోపాలరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో ఆడపిల్లలకు చదివించడంతో పాటు వారి స్వీయ రక్షణకై ప్రభుత్వాలు చట్టాలు చేశారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండచిలువ హతం

కోటబొమ్మాళి: కొండపేట గ్రామంలో కొండ పక్కన ఉన్న ఓ వీధిలో పశువులశాలలోకి ప్రవేశించిన కొండచిలువను స్థానికులు హతమార్చారు. సుమారు 10 అడుగుల పొడవు ఉన్న కొండచిలువ మంగళవారం సంచరించడంతో పక్షులు, ఆవులు, కోళ్లు బెదిరిపోయాయి. దీనిని గమనించిన యువకులు హతమార్చారు. 15 రోజులుగా విష సర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేత

కోటబొమ్మాళి: జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా మంగళవారం దంత ప్రాథమికోన్నత పాఠశాలలో నోట్‌బుక్స్, రైటింగ్ ప్యాడ్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. జనసేన మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి పల్లి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు కిట్లు పంపిణీ చేవారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పవన్ కల్యాణ్ అభిమానుల సంఘం ప్రతినిధులు నక్క సోమేష్, అండ పవన్, మెండ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచి పౌరులుగా సేవలు అందించండి

పలాస: మంచి పౌరులుగా తయారై ప్రజలకు సేవ చేయాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి కోరారు. మంగళవారం డిగ్రీ కళాశాలలో దీక్ష ఆరంభ్ ఇండెక్షన్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ ఎస్, క్రీడలు, లైబ్రేరీని విని యోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ గణపతి, పీడీ మధు, నర్సింహులు, హేమాచలం, ప్రసాద్ పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులపై అవగాహన అవసరం

నందిగాం: రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని లఖిదాసుపురం ఉన్నతపాఠశాల హెచ్‌ఎం చిలుకు కృష్ణారావు అన్నారు. మంగళవారం పాఠశాలలో భారత రాజ్యాంగం-న్యాయ అంశాలపై సోషల్ ఉపాధ్యాయులు బెందాళం రత్నం ఆధ్వర్యంలో వివరించారు. రాజ్యాంగం కల్పించే హక్కులను కాపాడుకోవాలన్నారు.

బ్రెయిన్‌డెడ్ బాధితుడి అవయవదానం



బాలరాజు (ఫైల్)


టెక్కలి: టెక్కలి జడ్పీ రోడ్డులో విద్యుత్ స్తంభంపై నుంచి జారి పడిన ప్రైవేట్ లైన్‌మెన్ బొమ్మాళి బాలరాజు(30) గాయపడడంతో రాగోలు జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం బ్రెయిన్‌డెడ్ కావడంతో ఆయన అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు మంగళవారం అంగీకరించారు. బ్రెయిన్‌డెడ్ అయిన బాలరాజుది సంతబొమ్మాళి మండలం గొల్లసీతాపురం. ఈయనకు భార్య ధనలక్ష్మి, కుమార్తె ఉన్నారు.

హాస్టళ్ల నిర్మాణానికి స్థల సేకరణ పూర్తి: ఆర్డీవో

హిరమండలం: మండలానికి మంజూరైన రెండు పీఎం జన్‌మన్ హాస్టళ్ల నిర్మాణానికి స్థల సేకరణ పూర్తయిందని టెక్కలి ఆర్డీవో బి.సురద్మన్ దొర అన్నారు. మంగళవారం గొడియాపాడు వద్ద సేకరించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ రెండు వసతి గృహాలకు సంబంధించి స్థల సేకరణ పూర్తి కావడంతో ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని చెప్పారు.

తాగు నీరు లేదు.. రోడ్లు లేవు

- నిలిచిపోయిన నిర్మాణాలు
- ఇదీ వజ్రపుకొత్తూరు లేఅవుట్‌లో పరిస్థితి


అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు

వజ్రపుకొత్తూరు

వజ్రపుకొత్తూరులోని జగనన్న కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడ కనీస వసతులు కొరవడ్డాయి. ఈ నేపథ్యంలో నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిపివేశారు. వైసీపీ ప్రభుత్వం కాలనీలో కనీస సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.


అధ్వానంగా ఉన్న కాలనీకి వెళ్లే రహదారి

ఇదీ పరిస్థితి..

వజ్రపుకొత్తూరులోని ఏర్పాటుచేసిన లేఅవుట్‌లో మొత్తం 53 మందికి ఇళ్ల స్థలాలు మంజూరుచేశారు. కాలనీలో కనీస వసతులు, తాగునీరు, రోడ్లు లేకపోవడంతో నిర్మాణాలకు మొదట్లో ఎవరూ ముందుకురాలేదు. ఈ తర్వాత అప్పటి ప్రభుత్వం లబ్ధిదారులపై ఒత్తిడి తీసుకొచ్చి పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టింది. అయితే మెటీరియల్ అక్కడకు తీసుకువెళ్లి పనులు నిర్వ హించేందుకు రోడ్డుసౌకర్యం లేకపోవడంతో కొందరు మధ్యలో నిర్మాణాలు నిలిపివేశారు. పది ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి.

బురదమయం..

ఇప్పటివరకూ తాగునీటి సమస్యను పరిష్కరించకపోవడంతో ఏ ఒక్కరూ ఉండేందుకు ముందుకురావడంలేదు. కొద్దిరోజుల పాటు ఉన్న వారు సైతం ఇక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. దీనికితోడు రహదారులు అధ్వానంగా ఉన్నా యి. చిన్నపాటి వర్షం కురిస్తే బురదమయమవుతున్నాయి. దీంతో ద్విచ క్రవాహనాలు సైతం వెళ్లడానికి వీల్లేకుండాపోతోంది. కాలనీ చుట్టూ అధి కారుల కార్యాలయాలు ఉన్నా ఇక్కడి సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి కాలనీలో మౌలిక వసతులు కల్పించి, నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

నీటి సౌకర్యం లేదు..



వజ్రపుకొత్తూరు జగనన్న కాలనీలో మంచినీటి సౌకర్యం లేకపోవడంతో నివాసం ఉండడంలేదు. దీంతో వజ్రపు కొత్తూరులో అద్దె ఇంట్లోనే ఉండాల్సి వస్తోంది. కొద్దిరోజులు ట్యాంకుల ద్వారా నీటిని తెప్పించు కొని నివాసం ఉన్నాను. అయితే తర్వాత ఎవరూ ఇక్కడ నివాసం లేకపోవడంతో మళ్లీ అద్దె ఇంటికి వెళ్లిపోయాను. అధికారులు కాలనీలో సమస్యలు పరిష్కారించాలి

-భాగ్యలక్ష్మి, కాలనీ లబ్ధిదారు

ఆమదాలవలసలో మైత్రి పోలీస్ మృతి

ఆమదాలవలస: ఆమదాలవలస స్టేషన్ పరిధిలో మైత్రి విధానంలో పోలీస్ విధులు నిర్వహిస్తున్న తెలుకుల గణేష్ (32) మృతిచెందినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మందస ప్రాంతానికి చెందిన గణేష్ ఆమదాలవలసలో బంగారం షాపుల వద్ద రాత్రివేళలో మైత్రి విధానంలో విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం జ్వరంతో బాధపడుతున్న గణేష్‌కు స్థానిక వైద్యుడు మోతాదుకు మించి ఔషధాలు ఇవ్వడంతో మృతిచెందినట్లు తల్లి ద్రౌపది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కేసును సీఐ పి.సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు మృతదేహాన్ని రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వివాహిత ఆత్మహత్య కేసులో ఇద్దరి అరెస్టు

నరసన్నపేట: నరసన్నపేటలో ఓ వివాహిత ఆత్మహత్య కేసులో అత్తమామలను అరెస్టుచేశారు. ఈమేరకు మంగళవారం అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడారు. గతనెల 28న నరసన్నపేటలో ఓ అపార్ట్‌మెంట్‌లో వరకట్న వేధింపులు తాళలేక బరాటం అనురాధ ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. దర్యాప్తులో భార్త శ్రావణ్‌తో పాటు అత్త విజయలక్ష్మి, మామ చిరంజీవి కూడా వరకట్నం కోసం వేధించినట్లు లభించిన ఆధారాలతో కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. కాగా టెక్కలి ఇన్‌చార్జి డీఎస్పీగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో అడిషనల్‌ఎస్పీ శ్రీనివాసరావు ఈ కేసు దర్యాప్తు చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

టెక్కలి: పోలవరం గ్రామానికి చెందిన వివాహిత బగాది మహాలక్ష్మి మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. భర్త రాజారత్నంతో వివాదాల వల్ల ఇంట్లో ఉన్న డీజిల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అయితే ఆమె శరీరం 50 శాతానికిపైగా కాలిపోవడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలించారు.ఈ మేరకు ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాగావళి నది పరిధిలో బీచ్‌ల పరిశీలన

ఎచ్చెర్ల: మండలంలోని తమ్మినాయుడుపేట, పొన్నాడ, కాళింపేట, లావేటిపేట, బొంతలకోడూరు గ్రామాల పరిధిలో నాగావళి వద్ద బీచ్‌లను ఇరిగేషన్ డీఈఈ జీవీ రమణ, ఏఈఈలు శ్రీనివాసరావు, రాంబాబు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్ మంగళవారం పరిశీలించారు. గ్రోయిన్లు ఎక్కడెక్కడ నిర్మించాలి, నదిలో నీటి ప్రవాహం పెరిగితే ఎటువంటి సమస్యలు వస్తాయి, ఇసుక ర్యాంపుల వల్ల ఇబ్బందులు అధ్యాయనం చేశారు.


లావేటిపేట వద్ద నాగావళి నదిని పరిశీలిస్తున్న అధికారులు

రోడ్లపై పశువులు కడితే కేసులు: ఎంపీడీవో

సరుబుజ్జిలి: గ్రామాల్లో రోడ్లపై పశువులు కట్టే వారిపై కేసులు నమోదు చేయాలని ఎంపీడీవో పీవీవీ మురళీమోహన్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కొత్తకోట సర్పంచ్ సురవరపు జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన పారిశుధ్య పనులు పరిశీలించారు. ప్రజలకోసం నిర్మించిన సీసీ రోడ్లపై పశువులు కట్టి ఉండడాన్ని ఎంపీడీవో గుర్తించారు. దీంతో సదరు వ్యక్తులకు అవగా హన కల్పించడంతో పాటు మొదటిసారి నోటీసు ఇచ్చి అప్పటికీ పశువులను రోడ్లపై కడితే కేసు నమోదు చేయాలని కార్యదర్శికి సూచించారు.

థర్మల్ అక్రమ కేసులు ఎత్తివేయాలి

రణస్థలం: థర్మల్ విద్యుత్ కేంద్రం ఉద్యమకారులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బీన ఢిల్లీరావు, ఏపీ బీసీ న్యాయవిదుల సంఘం ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోంపేట మండలంలోని బీల ప్రాంతంలో థర్మల్ విద్యుత్‌కేంద్రం ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఆందోళనచేసిన ఉద్యమకారులపై 2010 జూలై 14న కాంగ్రెస్‌హయాంలో జరిగిన పోలీసులకాల్పుల్లో ముగ్గురు మృతి చెందారని తెలి పారు. 723 మందిపై తప్పుడుకేసులు పెట్టారని వివరించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు ఆలీ బేగ్, బద్రి సీతమ్మ పాల్గొన్నారు.


ఎంపీ అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘ నాయకులు

ఉద్యానవన పంటలకు ప్రాధాన్యం: ఏపీడీ

లావేరు: ఉపాధిహామీ పథకంలో భాగంగా ఉద్యాన వన పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎచ్చెర్ల క్లస్టర్ ఏపీడీ లోకేష్ తెలిపారు. మంగళవారం లావేరులో ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉద్యానవన చెట్లు చూట్టూ కందకాల పనులు చేపట్టాలన్నారు. ఫారం పొండ్లు పనులు చేపట్టాలన్నారు. 100 రోజులు పని చేసే కుటుంబాల సంఖ్యను పెంచాలన్నారు. రెండేళ్లకు సంబందించిన వర్క్‌ఫైళ్లను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో ఆర్.సత్యవతి, జేఈ లెలిన్‌బాబు పాల్గొన్నారు.


లావేరు: మాట్లాడుతున్న లోకేష్

ఉపాధి పనుల పరిశీలన

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో ధనుంజయ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన రైతులకు అందజేస్తున్న పథకాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

వినాయక మండపాల ఏర్పాటుపై అవగాహన

బూర్జ: బూర్జ తహసీల్దార్ కార్యాలయంలో వినాయక మండపాల ఏర్పాటుపై అవగాహన కోసం మంగళవారం పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ అధికారులతో సమన్వయ సమావేశం మంగళవారం జరిగింది. గణేష్‌ఉత్సవాల మండపాలను ఏర్పాటు చేస్తున్న కమిటీ సభ్యులతో మాట్లాడి క్షేత్రస్థాయిలో పరిశీలించి సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు జారీ చేయడంపై అంశాలను చర్చించారు. సమావేశంలో తహసీల్దార్ ఈశ్వరమ్మ,ఎస్ఐ ఎం.ప్రవల్లిక, ఫైర్‌ఎస్ఐ సర్వేశ్వరరావు, ఏఈ అప్పన్న పాల్గొన్నారు.

బాహుదా వంతెన రోడ్డు గోతులమయం

- వాహనచోదకులు, ప్రయాణికుల అవస్థలు


బాహుదా నది వంతెన రోడ్డుపై అడుగడుగునా గోతులు ఏర్పడిన దృశ్యం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం వద్ద బాహుదానదిపై గల వంతెన రోడ్డు గోతులమయంకావడంతో వాహన చోదకులు, ప్రయాణికుల అవస్థలు అవస్థలకు గురవుతున్నారు.ఈవంతెన మీదుగా నిత్యం 20గ్రామాల ప్రజలు రాకపోకలతో రద్దీగా ఉంటోంది.ఈమార్గంలోనే రైతులు, వ్యాపారులు,విద్యార్థులు సైకిళ్లు, ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు.ఈవంతెన మీదుగా ఒడిశాలోని పలు గ్రామాల ప్రజలు ఇచ్ఛాపురం వస్తుంటారు. తరచూ పలువురు గోతుల్లో పడి గాయపడుతున్నారు. ఇటీవల వంతనమీదుగా సైకిల్‌పై వస్తున్న ఓ వ్యక్తి గోతులను తప్పించేక్రమంలో నదిలో పడి మృతిచెందిన విషయం విదితమే. వంతెన రోడ్డు అడుగడుగునా గోతులమయమైనాఐదేళ్లలోవైసీపీ ప్రభుత్వం కనీస మర మ్మతు చేయలేదలని పలువురు ఆరోపిస్తున్నారు.అధికారులు, ప్రజాప్ర తినిధులు స్పందించి వంతెన రోడ్డుకు మరమ్మతులుచేయాని పలువురు కోరుతున్నారు.

వరద బాధితులకు పది వేల పులిహోర ప్యాకెట్లు


పులిహోర ప్యాకెట్లను తయారు చేస్తున్న సిబ్బంది

అరసవల్లి: విజయవాడలోని వరద బాధితులకు అరసవల్లి దేవ స్థానం నుంచి పది వేల పులిహోర ప్యాకెట్లు, పది వేల మంచినీటి ప్యాకెట్లను పంపించినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈవో డిఎల్‌వి రమేష్ బాబు తెలిపారు. ఈ మేరకు ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, సిబ్బంది ఆధ్వర్యంలో పులిహోర పొట్లాలను తయారు చేయించి, వాహనం ద్వారా శ్రీకాకుళం నుంచి విజయవాడకు మంగళవారం పంపించారు. ఆ వాహనానికి ఈవో రమేష్‌బాబు, ప్రధాన అర్చకులు శంకరశర్మ జెండా ఊపి ప్రారంభించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం: పీవో


జి.సిగడాం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలు

జి.సిగడాం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎచ్చెర్ల ఐసీడీఎస్ పీవో డీల పాపినాయుడు తెలిపారు. మంగళవారం జి.సిగడాం పీహెచ్‌సీ, మెట్టవలస అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు.ఈ సందర్భంగా జి.సిగడాంలో ర్యాలీచేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి యశ్వంత్, సూపర్‌వైజర్ టి.లక్ష్మి సీహెచ్‌వో శివప్రసాద్ పాల్గొన్నారు.

- **ఇచ్ఛాపురం :** ఇచ్ఛాపురం ప్రాజెక్ట్‌లో గల 6, 12, 14 వార్డుల పరిధిలో గల బోర, బొబ్బిలి, పొందర, మహంతి వీధులు, చాకలిపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ పీఓ నాగరాణి గర్భిణులు, కిషోరీ బాలింతలు, ప్రీస్కూల్ విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజాత, మహిళా కార్యదర్శి ఉషా, కొరాయి ధర్మరాజు, కొండా శంకర రెడ్డి, నీలాపు ఢిల్లీ పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

సోంపేట: నిత్యవసర సరకులు ధరలు తగ్గించాలని సీపీఐ ఆధ్వర్యంలో సోంపేటలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారంరోజుల ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, నారాయణ, పుక్కల అరెలమ్మ పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ దూరం

కవిటి: అవగాహనతోనే ఎయిడ్స్ దూరం చేయవచ్చని రాజపురం పీహెచ్‌సీ వైద్యులు శశిధర్, మౌనిక తెలిపారు. మంగళవారం రాజపురం పీహెచ్‌సీలో వైసిటి ప్రివెంటేషన్ యూనిట్ ఆధ్వర్యంలో ఆశ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వై.రవికుమార్,జె.బారతి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఎచ్చెర్ల: అరిణాం అక్కివలసలోని నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు లింగాల సన్యాసి ఇటీవల మృతిచెందడంతో కుటుంబానికి మంగళవారం ఆర్థికసాయం చేశారు. కార్మికుల, ఉద్యోగుల ఒక రోజు వేతనం, గ్రాట్యూటీతో కలిపి రూ. 12,43,125 చెక్కును సన్యాసి భార్య ఈశ్వరమ్మ, కుమారుడు వరదరాజులుకు పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ కె.శేషగిరిరావు, హెచ్‌పీడీ హెడ్ కె.శ్యాంప్రసాదరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావుఅందజేశారు.

ఫార్మా కంపెనీ ప్రమాదంలో మృతుని కుటుంబానికి..

పొందూరు : పొందూరుకు చెందిన హంస ప్రశాంత్ కుటుంబానికి వైసీపీ ప్రకటించిన రూ.ఐదు లక్షల చెక్కును మంగళవారం మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అందజేశారు.ప్రశాంత్ అచ్యుతాపురం ఫార్మా కంపెనీ ప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పి.రమేష్, నాయకులు కె. రమణమూర్తి, గుడ్ల మోహన్, గోవింద, రమణమ్మ పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో వసతుల కల్పనపై దృష్టి

ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించినట్లు క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు. మంగళవారం ఇక్కడి క్యాంపస్‌లోని హాస్టల్‌ను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆహారం నాణ్యత విషయంలో తగిన జాగ్రత్త తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన కృష్ణ చౌదరి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

కంచిలి: గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో వి.నీరజ కోరారు. మంగళవారం గొల్లపుట్టుగలో గల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి ట్యాంకులు క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, నీటి సరఫరా సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేసుకోవాలి: ఏవో

బూర్జ: పంట నమోదు చేసుకున్న రైతులు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం అప్పలపేట రైతు సేవా కేంద్రం పరిధిలో జరుగుతున్న ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ, ఉద్యానవన పంటలు 12,513 ఎకరాల్లో సాగుచేస్తుండగా ఇప్పటి వరకూ 8,184 మంది రైతులు 11063 ఎకరాలు పంట నమోదు చేశారని తెలిపారు. కార్య క్రమంలో వీఆర్వో బొబ్బిలి అచ్యుతరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు కొరారి పోలరాజు పాల్గొన్నారు.


ఈకేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

నేడు, రేపు సాగర్‌కవచ్

గార: సాగర్ కవచ్‌ను బుధ, గురువారాల్లో నిర్వహించనున్నట్లు కె.మత్స్యలేశం (కళింగపట్నం) మెరైన్ సీఐ బి.ప్రసాదరావు తెలిపారు. మంగళవారం మెరైన్ పోలీసుస్టేషన్ వద్ద సిబ్బందికి సాగర్‌కవచ్‌పై సూచనలుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీరం నుంచి అనుమానిత వ్యక్తులు కదలికలపై నిఘాఉంచాలని తెలిపారు. తీరప్రాంతగ్రామాల్లో అనుమానితులు సంచరిస్తుంటే సమాచారాన్ని పోలీసులకు సమాచారాన్ని తెలియజేయాలని మత్స్యకారులుకు అవగాహన కల్పించాలని చెప్పారు.రెండురోజులు తీరంలో కోస్ట్‌గార్డ్, లోకల్ పోలీస్, నేవీ సిబ్బందితో కలిసి గస్తీ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, ఏఎస్ఐ పాల్గొన్నారు.

నేటి నుంచి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

గుజరాతీపేట: శ్రీకాకుళంలోని ఐటీఐ కళాశాలలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బుధవారం నుంచి శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఐఎల్‌వో సంయుక్తంగా స్టార్ట్ యువర్ బిజినెస్, జనరేట్ యువర్ బిజినెస్‌పై శిక్షణఇస్తున్నట్లు పేర్కొన్నారు.జిల్లా పరిశ్రమల కేంద్రం, పరిశ్రమల అనుమతులు,బ్యాంకింగ్‌రంగం, స్టాండ్ ఆఫ్‌ఇండియా, ముద్ర, పీఎంఈజీపీ, ఇతర ఎస్ఎస్‌ఓ రుణాలకు సంబంధించి ఎనిమిదిరోజులపాటు యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.అభ్యర్థులకు పరిశ్రమలస్థాపనపై అవగాహనకల్పించి శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తోపాటు బ్యాంకు రుణం అందించేలా చర్యలు తీసుకుంటా మని పేర్కొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీలోని ఇండోర్ స్టేడియంలో బుధవారం నుంచి మూడురోజులపాటు ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్-19 బాల బాలికల పోటీలు జరుగుతాయి.ఈ పోటీలకు 201 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. కాగా పోటీల్లో భాగంగా మంగళవారం క్వాలిఫైయింగ్ రౌండ్ పూర్తిచేశారు. ఇందులో వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా 35 మంది అర్హత సాధించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఇప్పటికే 130 మంది క్రీడాకారులు మెయిన్ డ్రాలో ఉండగా, మరో 36 ర్యాంకింగ్ ప్లేయిర్స్ ఉన్నారు.

మాజీ సైనికుల పిల్లలకు పీఎం ఉపకార వేతనం

అరసవల్లి: జిల్లాలో 2024-25 సంవత్సరంలో వృత్తి విద్యా కోర్సులు మొదటి సంవత్సరం చదువుతున్న మాజీ సైనికులు, వితంతువుల పిల్లలు ప్రధానమంత్రి ఉపకార వేతనం కోసం కేంద్రీయ సైనిక బోర్డు ఆదేశాల మేరకు నవంబరు 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమాధికారి శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద విద్యార్థికి నెలకు రూ.2500లు, విద్యార్థినికి నెలకు రూ.3000లు చొప్పున ఉపకార వేతనం మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నా రు. ఈమేరకు విద్యార్థులు అర్హత పరీక్షలో కనీసం 60శాతం మార్కులు పొంది ఉండాలని తెలిపారు.అర్హత గలవారు తమ దరఖాస్తును డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ. కెఎస్‌బి. జిఓవి.ఐఎన్ ద్వారా పూర్తిచేసి సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వివరాలకు 8688817943 ఫోన్ నెంబరుకు సంప్రదించాలని కోరారు.

సచివాలయ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు

ఎచ్చెర్ల: మండలంలోని ఇబ్రహీమ్‌బాద్ సచివాలయ కార్యదర్శికి ఎంపీడీవో రమాదేవి మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గ్రామంలో ఆరుగురు దివ్యాంగులు నకిలీ ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్నారని తెలిపారు. వారిని అనర్హులుగా వైద్యులు సైతం ధ్రువీకరించడంతో పింఛన్లు అందజేయవద్దని తెలియజేసినా కార్యదర్శి పంపిణీచేశారని పేర్కొన్నారు. ఈ మేరకు నిర్లక్ష్య వైఖరిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదోనని ఎంపీడీవో నోటీసులో పేర్కొన్నారు.

గురుగుబిల్లిలో అసిరితల్లి పండుగ


లావేరు : గురుగుబిల్లిలో అమ్మవారి వారాల పండుగలో పాల్గొన్న భక్తులు

లావేరు: మండలంలోని గురుగుబిల్లిలో మంగళవారం అసిరితల్లి అమ్మవారి వారాల పండుగ ఘనంగా జరిగింది. అమ్మవారికి పసుపు కుంకుమలు, ముర్రాటలతో భక్తులు మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా బంధువులు పెద్దసంఖ్యలో రావడంతో సందడి నెలకొంది. ఏటా వరి నాట్లు నాటిన తర్వాత వారాల పండగను జరుపు కోవడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సహస్రనామ పూజలు

ఆమదాలవలస: పట్టణంలోని లక్ష్మీనగర్ వీధిలో గల వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నెలరోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న శ్రావణలక్ష్మి అష్టోత్తర సహస్రనామ పూజలు మంగళవారం ముగిశాయి.ఈసందర్భంగా లక్ష్మీదేవికి మంగళహారతులతో సహస్రనామం ముగించారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి: డీఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్: నేరాల నియంత్రణకు కృషి చేయాలని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద కోరారు.మంగళవారం శ్రీకాకుళంలో మహిళా పోలీసులతో సమావేశం ఏర్పాటుచేశారు.ఈసందర్భంగా మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై సమాచారాన్ని అందించాలని తెలిపారు. వినియక మండపాల ఏర్పాటు, నిమజ్జనం వివరాలపై కమిటీసభ్యులతో మాట్లాడి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఉత్సవాలు జరిగేలా చర్యతీసుకోవాలని కోరారు. కార్య క్రమంలో సీఐలు పైడపునాయుడు, అవతారం, ఎస్ఐలు కృష్ణప్రసాద్, వాసుదేవరావు, కృష్ణారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వివేకానంద

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

ఇచ్ఛాపురం: కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎస్ఎంసీ ఛైర్మన్ శ్రీకాంత్ మహంతి రూ.50 వేలు విలువ చేసే ఎలక్ట్రికల్ పరికరాలు అందజేశారు. మంగళవారం హెచ్‌ఎం నరేంద్రనాధ్‌పట్నాయక్‌కు మైక్‌సెట్, యాంప్లీ ఫైయర్, రెండు మౌత్‌లు, సౌండ్ బాక్సులను ఇచ్చారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ల పంపిణీ

కంచిలి: కొల్లూరుకు చెందిన పిలక నారాయణకు వృద్ధాప్య పింఛన్‌ను బరంపురం ఎంకేసీజీ ఆసుపత్రికి వెళ్లి సచివాలయ సంక్షేమ విద్యా సహాయకుడు కుప్పిలి వెంకటరావు మంగళవారం అందజేశారు. నారాయణ అనారోగ్యంతో అక్కడ చికిత్సపొందుతున్నాడు.

- **కవిటి:** కవిటి పంచాయతీలోని పొడియాపుట్టుగకు చెందిన పి.భూదేవి, సరస్వతిలకు కవిటి-3 సచివాలయం డిజిటల్‌అసిస్టెంట్ అబ్దుల్ ఖాదర్ మంగళ వారం విశాఖలోని ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. వారిద్దరూ విశాఖలో చికిత్సపొందుతున్నారు.

సామాజిక అంశాలపై శ్రద్ధ చూపాలి

ఆమదాలవలస: మహిళా సంఘాలు ఆర్థిక అంశాలకే పరిమితం కాకుండా సామాజిక అంశాలపై శ్రద్ధ చూపాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీఎం పైడి కూర్మారావు సూచించారు. మంగళవారం పొన్నాంపేటలో గాలాల హేమలత అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమంలో మీన, భవానీ, గాయ త్రీ, రామప్పడు పాల్గొన్నారు.

సమావేశాలు నిర్వహించండి


రికార్డులు పరిశీలిస్తున్న ప్రసాద్

ఇచ్ఛాపురం: సంఘ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని ఏపీఎం సనపల ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఇచ్ఛాపురం వెలుగు కార్యాలయంలో స్వ యం శక్తి సంఘాల లీడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాలకు అందించే రుణాలు, ఉన్నతి తదితర రికార్డులను పరిశీలించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పొందూరు: మండలంలోని గారపేట (కృష్ణాపురం) ప్రభుత్వపాఠశాల విద్యార్థులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా జనసేన నాయకుడు గార బాబూరావు ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలు, విద్యా ఉపకరణాలను అందించారు.కార్యక్రమంలో అంబల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- **కంచిలి:** అర్జునాపురం ప్రాథమిక పాఠశాలలో 22 మంది విద్యార్థులకు జనసేన నాయకులు టీషర్టులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో నాయకులు రవి, మోహన్, రుషి, కృష్ణ, మహేష్, మనోజ్, పూర్ణ, ఉపాధ్యాయులు బాబూరావు, సంధ్య, కామేష్ రెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు..

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని ద్వారకానగర్‌లోగల ఖ్యాతి ఓల్డ్ ఏజ్ హోమ్, కలెక్టరేట్ వద్ద బెహరా మనోవికాస కేంద్రానికి 25 కేజీల బియ్యంతో పాటు నిత్యావసరసరుకులు, డస్ట్‌బిన్స్, స్టీల్‌గ్లాసులు,కంచాలను స్థానిక వాసవి, వనిత క్లబ్‌లు సంయుక్తంగా అందజేశాయి. కార్యక్రమంలో మామిడిపాక సుధాకర్, పేర్ల మహేష్, వీఎస్ఎల్ నరసింహం, మాటూరు దీపక్, మామిడిపాక వెంకటరావు, గ్రంధి నాని, పట్నాల ఆనంద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన డీఎస్పీ

రణస్థలం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును శ్రీకాకుళం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ వివేకానంద మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు.

జాబ్‌మేళాలో 63 మంది ఎంపిక

గుజరాతీపేట: శ్రీకాకుళంలోని మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలోగల నోడల్ రిసోర్స్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 63 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. మేళాలో పది ప్రైవేటు కంపెనీలకు సంబంధించి ప్రతినిధులు హాజరు కాగా 187 మంది ఇంటర్వ్యూలకు వచ్చారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావుపర్యవేక్షణలో జరిగినమేళాలో ప్లేస్‌మెంట్‌అధికారి వంశీ పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

జి.సిగడాం: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని ఎంపీడీవో కె.నిశ్చల తెలిపారు. మంగళవారం పెంట గ్రామంలో మనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో సీహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.